# కథ

# నిర్ణయం

## "సార్..మీ పుస్తకం"

**తన సీటులో కూర్చుని పనిచేసు కుంటున్న కిరీటి తలెత్తి చూశాడు. ఎదురుగా అతని కొలీగ్ సౌజన్య నిలబడి ఉంది. ఆమె చేతిలో అతనిచ్చిన పుస్తకం.**

**"చదివారా?" పుస్తకం అందుకుంటూ అడిగాడు.**

**"ఆ.. నిన్నరాత్రి పన్నెండు గంటలకు పూర్తిచేశాను. మీకు చాలా థాంక్స్. మంచి పుస్తకాన్ని నాచే చదివింపజేశారు"**

"మీకు ఇంత మంచి అభిరుచి ఉండటం గొప్ప విషయం. మీలాగే నాకూ పుస్తకాలంటే ప్రాణం. పుస్తకాలే నాకు లోకజ్ఞానాన్నీ, సంస్కారాన్ని యిచ్చింది. అన్నట్టు మీరు చలంగారి 'మైదానం' చదివారా?"

లేదన్నట్లు తల అడ్డంగా ఊపింది సౌజన్య.

"రేపు తీసుకురానా?"

"నేను రేపటినుంచి నాలుగురోజులు శెలవు. చీరాల వెళ్తున్నాను. వచ్చాక తీసుకుంటాను"

"అమ్మా నాన్నల మీద మనసు పోయిందా?" నవ్వుతూ అడిగాడు కిరీటి.

"కాదు" అంటూ ఏదో చెప్పబోయి ఆగిపోయింది సౌజన్య.

"నాకర్థమయిందిలెండి. ఐ విష్ యు ఆల్ ది బెస్ట్"

"ఏమర్థమయింది మీకు?" చిరుకోపంగా అంది సౌజన్య.

"ఊరి నుంచి వచ్చాక నాకు స్వీట్ యిచ్చి ఓ స్వీట్ న్యూస్ చెబుతారు మీరు"

సౌజన్య అందంగా సిగ్గుపడింది.

"ఇప్పట్నుంచే అక్కర్లేదు. పెళ్ళి చూపులప్పుడు సిగ్గుపడితే చాలు"

"నేను వెళ్తున్నాను" అంటూ సిగ్గుతో కందిన తన మొహం అతనికి కనిపించకుండా తల తిప్పుకొని వెళ్ళిపోయింది సౌజన్య.

సౌజన్యకు పెళ్ళంటే కిరీటికి బాధగా అన్పించింది. పైకి అలా నవ్వుతూ మాట్లాడేగాని నిజానికి ఆమె మరొకరి సొంతం కావడం అతనికి యిష్టం లేదు. ఆమె ఒప్పుకుంటే ఆమెను పెళ్ళి చేసుకోవాలన్న ఆలోచన అతనికి ఉంది. వాళ్ళిద్దరి అభిరుచులూ, ఆలోచనలూ, భావాలు ఒక్కటే కావడం అందుకు కారణం. పైగా సౌజన్య ఎంతో అందంగా కూడా ఉంటుంది. సమయం చూసి తను మనసులోని మాటను ఆమెకు చెప్పాలనుకున్నాడు. ఇప్పుడు సమయం దాటిపోయింది. అయినా యింకా పెళ్ళి చూపులేగా. అన్నీ కుదరాలి కదా అనుకున్నాడు మనసులో.

* * *

పెళ్ళికొడుకు పెద్ద అందగాడు కాడుగాని చూడటానికి బాగానే ఉన్నాడనిపించింది సౌజన్యకు. అతను హైదరాబాదులో మంచి కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడని విన్నది. అతన్ని వద్దనడానికి ఆమెకు ఏ కారణం కనిపించలేదు. అందుకే తల్లిదండ్రులు ఆమె అభిప్రాయం అడగగానే నచ్చాడని చెప్పింది.

తన గదిలో కూర్చుని ఉన్న సౌజన్యకు హాల్లో ఆమె తల్లిదండ్రులు అబ్బాయి పెద్దలతో మాట్లాడే మాటలు స్పష్టంగా వినిపించకపోయినా, తాము యివ్వవలసిన కట్నం గురించే వాళ్ళు చర్చించుకుంటున్నారని అర్థమైంది ఆమెకు. ఆమె మనసంతా అదోలా అయిపోయింది. కట్నం యిచ్చి పెళ్ళి చేసుకోవడం ఆమెకి యిష్టం లేదు. ఆమె చదివిన పుస్తకాలు ఆమెలో విజ్ఞతని, వివేకాన్ని, ఆదర్శభావాల్ని పెంచాయి. కట్నం లేకుండా పెళ్ళి చేసుకునే ఆదర్శ పురుషుని జీవితంలో అడుగుపెట్టాలనుకుంది. అయితే ఆమె ఆలోచనల్ని ఆమె తండ్రి కొట్టిపడేశాడు. "పెళ్ళప్పుడు కట్నం లేకుండా చేసుకున్నా, తర్వాత చూశావా...నీకోసం నేనెంత త్యాగం చేశానో అని జీవితాంతం దెప్పుతూ ఉంటారని, అంతకంటే కట్నం తీసుకునేవాళ్ళే భార్యలను చక్కగా చూసుకుంటున్నారని, తన అనుభవంలో యిటువంటి జంటల్ని చాలా చూశానని" చెప్పాడు ఆమె తండ్రి.

"ఏమిటక్కా? అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు" ప్రక్కనే కూర్చున్న ఆమె చెల్లెలు ఉమ అడిగింది.

"ఏం లేదు" నిర్లిప్తంగా అంది సౌజన్య.

ఇంతలో తల్లి లోపలికి రావడం చూచి "అమ్మా, నన్ను ఎంతకు అమ్ముతున్నారు?" అని అడిగింది సౌజన్య.

ఉమ కల్పించుకుని "డబ్బు వాళ్ళు యివ్వడం లేదు కాబట్టి నీ ప్రశ్న తప్పు. ఎంత యిచ్చి నన్ను వదిలించుకుంటున్నావు అని అడగాలి" అంది.

"చాల్లే మీ మాటలు. ఇంట్లో శుభకార్యం జరుగుతూంటే అలాంటి మాటలు మాట్లాడకూడదు" మందలించింది శాంత.

"సరే. మాట్లాడంగాని వాళ్ళు ఎంత అడిగారో, మీరు ఎంతకు ఒప్పుకున్నారో చెప్పమ్మా" అంది సౌజన్య అర్థింపుగా.

"వాళ్ళు కట్నమే కాస్త ఎక్కువగా అడిగారు. లాంఛనాలు వద్దట. పెళ్ళి సింపుల్‌గా గుడిలో చేసినా చాలట. బట్టలు, నగలు అన్నీ మన యిష్టం"

"అదే..ఆ కట్నమే ఎంత అడిగారు?" ఆతృతగా అడిగింది సౌజన్య.

"అవన్నీ నీకెందుకు? అబ్బాయి నీకు నచ్చాడు కదా. అదే మాకు కావల్సింది. మిగిలిన విషయాలన్నీ నాన్నగారు చూసుకుంటారు."

"నీవు చెప్పకపోతే వెళ్ళి పెళ్ళికొడుకునే అడిగేస్తాను" బెదిరిస్తూ అంది సౌజన్య.

సౌజన్య వైపు భయంగా చూసి, "ఏం పిల్లలో మీరు? మిమ్మల్ని చూసి మేము భయపడాల్సి వస్తుంది" అని, బయటినుంచి లోపలికి ఎవరూ రావడం లేదని నిర్ధారించుకుని "రెండు లక్షలు అడిగారు" అంది శాంత.

"రెండు లక్షలా?" ఒక్కో అక్షరాన్నీ ఒత్తి పలుకుతూ కళ్ళు పెద్దవి చేసి అడిగింది సౌజన్య.

"అవును. నాన్నగారు కూడా ఒప్పుకున్నారు. మేము అనుకున్నదానికంటే ఓ యాభైవేలు ఎక్కువే అడిగినా, డబ్బుకు వెనకాడి కాళ్ళ దగ్గరకు వచ్చిన సంబంధాన్ని కాదనకూడదు కదా"

"మరి ఆ డబ్బు ఎలా సమకూరుస్తారు? తర్వాత మీరేం తింటారు? ఉమ పెళ్ళి ఎలా చేస్తారు?" అయోమయంగా చూస్తూ అడిగింది.

"ఇలా ఆలోచించి మనసు పాడుచేసుకుంటావనే నేను చెప్పలేదు. నామాట విని మనసులో ఎలాంటి ఆలోచనలూ పెట్టుకోకుండా కమ్మని కలలు కంటూ ఈ నెలరోజులూ గడిపెయ్. అంతా మంచే జరుగుతుంది" అంటూ వెళ్ళిపోయింది శాంత.

ఆ రోజు రాత్రి తండ్రితో ఎంతో వాదించింది సౌజన్య. ఆయన ఆమెకు నచ్చచెప్పలేదు సరికదా అసలు ఆమె మాటల్ని కూడా పట్టించుకోలేదు.

"నేను ఏది చేసినా నా పిల్లల జీవితాలు బాగుండాలనే చేస్తాను. ఆదర్శాలు ఉండటం మంచిదే కానీ 'అన్నీ అనుకున్నట్లు జరగవు' అన్న విషయం కూడా తెలుసుకోవాలి నీవు. ఇకపై కట్నం గురించి యింటిలో ఎలాంటి డిస్కషన్స్ జరగకూడదు. నా పాట్లేవో నేను పడతాను. నన్ను వదిలెయ్యండి" అంటూ మరే వాదనలకూ అవకాశం యివ్వలేదు ఆయన.

సౌజన్య మనసులోనే బాధపడసాగింది.

* * *

ఆఫీసులో సౌజన్య ఎప్పటిలా ఉత్సాహంగా ఉండటం లేదని తోచింది కిరీటికి. 'బహుశా ఆమెకు చూసిన



సంబంధం కుదరలేదేమో' అనుకున్నాడు. సంతోషపడ్డాడు కూడా. అయితే ఆరోజు సాయంత్రం తనకు పెళ్ళి కుదిరిందని సౌజన్య చెబితే ఆశ్చర్యపోయాడు.

"అయితే ఎందుకంత డల్‌గా కనిపిస్తున్నారు? నవ్వుతూ, తుళ్ళుతూ ఉండాలి ఈ సమయంలో" అన్నాడు.

"అమ్మా నాన్నల్ని వదలి వెళ్ళాలంటే బాధగా ఉంది" అంది అతనికి అసలు విషయం చెప్పడం యిష్టంలేక.

"అది సహజం. ఆడవాళ్ళకు తప్పని పరిస్థితి యిది. అంతెందుకు? మీరు హైదరాబాదు వెళ్ళిపోతారంటే నాకే ఏదోలా ఉంది" అన్నాడు. అలా అంటునప్పుడు అతని కంట్లో నీరు తిరిగింది.

"ఈ విషయం ఆఫీసులో ఎవరికీ చెప్పకండి. మెల్లగా నేనే చెప్తాను" అంటూ తన సీటు వద్దకు వెళ్ళిపోయింది సౌజన్య.

భారమైన మనసుతో ఆమె వెళ్ళిన వైపే చూస్తూండిపోయాడు కిరీటి.

* * *

కళ్యాణ మండపంలో తనకు కేటాయించిన గదిలో కూర్చుని పుస్తకం చదువుకుంటూంది సౌజన్య. ఇంతలో ఉమ లోపలికి వచ్చి-

"అక్కా, నాన్న పెళ్ళికొడుకు వాళ్ళకు లక్షన్నర రూపాయలే యిచ్చారట. ఎంత ప్రయత్నించినా మిగిలిన డబ్బు సర్దలేకపోయారట. ఆ యాభైవేలు తమకు అందేవరకు విడిది నుంచి కదలమని పెళ్ళికొడుకు అన్నాడట" అంది.

సౌజన్య అయోమయంగా చెల్లెలి వైపు చూస్తూ "నీవు విన్నది నిజమేనా?" అని అడిగింది.

"నిజమే అక్కా. అమ్మ నాతో చెప్పి ఏడ్చింది. నాన్న హడావుడిగా బయటకు వెళ్ళిపోయారు. ఎక్కడికి పోతున్నారో ఎవరికీ చెప్పలేదు"

సౌజన్య నీరసంగా మంచంపై కూర్చుని టైము చూసింది. ఏడు గంటలు చూపిస్తోంది వాచ్. 'తెల్లవారు ఝామున రెండుగంటలకు ముహూర్తం. నాన్న ఆ డబ్బు అరేంజ్ చేయడానికి యింకా ఏడుగంటల వ్యవధి ఉంది. ఎక్కడినుంచి తెస్తారు ఈ ఆఖరి నిమిషంలో? అదీ రాత్రిపూట' అనుకుంది. తమ తాహతుకు మించి అంత కట్నం యిచ్చేందుకు ఒప్పుకున్నందుకు, ఆర్భాటంగా పెళ్ళి ఏర్పాట్లు చేసినందుకు ఆమెకు తండ్రిపై చిరాకుతో పాటు కోపం కూడా వచ్చింది. పెళ్ళికొడుకు ప్రవర్తన తలచుకుంటూంటే ఆమెలో అసహనం పెరగసాగింది. అలాగే మంచంపై వాలిపోయింది అలసటగా.

* * *

"సౌజన్యా నీకోసం ఎవరో వచ్చారు"

స్నేహితురాలి పిలుపు విని లేచి కూర్చుంది. ఎదురుగా కిరీటి నిలబడి ఉన్నాడు చేతిలో గిఫ్ట్ ప్యాకెట్‌తో. వెంటనే లేచి-

**సి.ఎస్.చంద్రశేఖర్**

"కూర్చోండి" అంది స్టూలు చూపిస్తూ.

"సారీ. మిమ్మల్ని డిస్టర్బ్ చేసినట్లున్నాను" అన్నాడు.

"ఫర్వాలేదు. ఆల్రెడీ డిస్టర్బ్డ్‌గానే ఉన్నాను"

ఎందుకని అడగలేదు అతను. చెప్పే విషయమే అయితే తనే చెబుతుందని ఊరుకున్నాడు.

గిఫ్ట్ ఆమె చేతిలో పెట్టి "కంగ్రాట్యులేషన్స్. పెళ్ళికొడుకు ఏ గదిలో ఉన్నారో చెప్పండి. ఒకసారి కలిసి కంగ్రాట్యులేషన్స్ చెబుతాను" అన్నాడు కిరీటి.

"ఆయన యింకా విడిది నుంచి రాలేదు. వస్తారో రారో కూడా తెలియదు"

కిరీటి అర్థం కానట్టు చూశాడు ఆమెవైపు. సౌజన్య వెక్కి వెక్కి ఏడవసాగింది.

"సౌజన్యగారూ ప్లీజ్! ఏడవకండి. ఇలాంటి సమయంలో మీరు కంటతడి పెట్టకూడదు. ప్లీజ్! కంట్రోల్ చేసుకోండి."

రెండు నిమిషాల తరువాత కళ్ళు తుడుచుకుని, కిరీటి వైపు తిరిగి "కిరీటిగారూ..నాకీ పెళ్ళి యిష్టంలేదు" అంది.

"ఎందుకు యిష్టంలేదు?" కంగారుగా అడిగాడు.

సౌజన్య పెళ్ళిచూపుల రోజునుంచి జరిగినదంతా అతనికి చెప్పింది.

"కిరీటిగారూ..నేను చదువుకున్నాను. మంచి ఉద్యోగంలో ఉన్నాను. అనాకారిని కాను. అయినా రెండులక్షలు మేము వాళ్ళకు ఎందుకివ్వాలి? కట్నం అడిగే సంబంధం చేసుకోనని నేను ఎంత మొత్తుకున్నా, నా మాటకు, నా ఆలోచనలకు విలువ యివ్వకుండా ఈ సంబంధం ఖాయం చేశారు నా తండ్రి. ఆడపిల్లనైనా నాకూ ఓ మనసుందనీ, నా మనసు విరిగిపోయేలా ప్రవర్తించిన ఆ వ్యక్తిని పెళ్ళి చేసుకోనని ఎంత చెప్పినా, ఆ యాభైవేలూ తీసుకురావడానికి యింకా ప్రయత్నిస్తూనే ఉన్నారాయన. ఇక పెళ్ళికొడుకు- పెద్ద చదువులు చదువుకుని, మంచి ఉద్యోగం చేస్తూ కూడా తేరగా వచ్చే డబ్బుకోసం ఆశపడేవాడు. ఒక కుటుంబం చితికిపోయినా, వీధిన పడినా ఫరవాలేదు. తనకు రావల్సిన డబ్బు అందేవరకూ విడిది నుంచి కదలిరానని పట్టుపట్టిన సంస్కారహీనుడు. మీరే చెప్పండి. ఎన్నో ఆశలతో అతని యింట్లో అడుగుపెట్టవలసిన నేను, విరిగిన మనసుతో, అసహ్యంతో ఎలా అతనితో జీవితం పంచుకోమంటారు?"

"మీ బాధ నేను అర్థం చేసుకోగలను. కానీ యిప్పుడేం చేయగలం మనం?" అన్నాడు కిరీటి.

"ఇంకా పూర్తిగా అయిపోలేదు కిరీటి గారూ..మీరు నాకో సహాయం చేస్తారా?"

"చెప్పండి. తప్పకుండా చేస్తాను"

"ముహూర్త సమయం లోపల నాకొక వరుణ్ణి చూసిపెట్టండి. అతను ఎలా ఉన్నా ఫరవాలేదు. ఏం చేస్తున్నా ఫరవాలేదు. ఏ కులమైనా ఫరవాలేదు. ఏమీ చదవకున్నా ఫరవాలేదు. కానీ..కాని అతనికి 'మనసు' మాత్రం ఉండాలి. ప్లీజ్ నాకోసం వెతికిపెట్టరూ"

"అది ఎలా సాధ్యం?"

"అవును. ఇంత తక్కువ సమయంలో సాధ్యం కాదు. మా నాన్న ఆ యాభైవేలూ తెచ్చి అతని చేతిలో పెట్టక మానడు. నేను ఆ దురాశాపరుడి భార్య కాక తప్పదు. పోనీ ఇంకో పని చెప్తాను. చేయగలరా?"

చెప్పమన్నట్టు చూశాడు.

"నా క్యారెక్టరు మంచిది కాదని మగపెళ్ళివారికి వార్త అందేలా చేయండి. అది విన్న పెళ్ళికొడుకు ఆ లోపాన్ని సరిపుచ్చుకోవడానికి మరో లక్ష అడుగుతాడు. మా నాన్న అంత డబ్బు యివ్వలేరు. కనుక పెళ్ళి ఆగిపోతుంది"

కిరీటి ఆమె వైపు జాలిగా చూశాడు.

"మీరు ధైర్యంగా ఉండండి. ఆ భగవంతుడిని నమ్ముకోండి. అంతా మంచే జరుగుతుంది మీకు. నేను మన ఆఫీస్ స్టాఫ్ వచ్చారేమో చూసి వస్తాను" అంటూ బయటకు నడిచాడు.

బయట అప్పుడే అక్కడికి చేరుకున్న ఆఫీస్ స్టాఫ్ కనిపించారు. నెల్లూరు నుంచి రెండు టాటా సుమోలు మాట్లాడుకుని దాదాపు పాతికమంది వచ్చారు.

"హలో కిరీటిగారూ..ఎప్పుడొచ్చారు మీరు?" అతని కొలీగ్ కళ్యాణి అడిగింది.

"నేను వచ్చి అరగంట అయింది. చీరాలకు నిన్న రాత్రే వచ్చాను" అన్నాడు కిరీటి. చీరాలలో అతని తల్లిదండ్రులు ఉంటున్నారు.

## ధోకాలేని కెరీర్

**చిన్నప్పటినుంచీ మోడలింగ్ అంటే నాకెంతో ఇష్టం. పద్నాలుగేళ్ళ ప్రాయంలోనే మోడల్‌గా నా కెరీర్‌కి శ్రీకారం చుట్టాను. మోడలింగ్‌నుంచి సినిమా రంగానికి వచ్చినా నాకు మంచి ఇమేజ్ ఉందంటోంది. అన్నట్టు బూమ్ చిత్రం ఫ్లాప్ అయినా నా కెరీర్‌కి ధోకా లేదంటోంది. అక్షయ్‌కుమార్ హీరోగా నటిస్తున్న ఓ చిత్రంతో పాటూ రాంగోపాల్‌వర్మ కొత్తచిత్రంలో తాను నటిస్తూ బిజీగా ఉన్నానంటోంది.**



"సౌజన్య ఎక్కడుంది?"

"లోపల గదిలో ఉంది. ఆమె చాలా బాధలో ఉంది. ముందు మీరొక్కరు వెళ్ళి ఓదార్చండి" అన్నాడు కిరీటి కళ్యాణితో మెల్లగా.

"బాధ ఏమిటి?" ఆశ్చర్యంగా కాస్త గట్టిగానే అడిగింది కళ్యాణి.

కిరీటి సౌజన్య తనతో చెప్పిన విషయం స్టాఫ్ అందరికీ చెప్పాడు.

"పోలీసులకి పట్టివ్వాలి అలాంటి మనుషుల్ని" కోపంగా అంది కళ్యాణి.

"అవన్నీ తర్వాత..ముందు ఆమె ప్రాబ్లమ్ ఎలా సాల్వ్ చెయ్యాలో ఆలోచించండి" అన్నాడు శ్రీనివాస్. అతను కళ్యాణికి భర్త. అదే డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడు.

"నేను వెళ్ళి సౌజన్యతో మాట్లాడి వస్తాను. మీరు యిక్కడే ఉండండి" అంటూ కళ్యాణి సౌజన్య ఉన్న గది ఎక్కడుందో కిరీటినడిగి తెలుసుకుని లోపలికి నడిచింది. కిరీటి మిగిలిన స్టాఫ్ మెంబర్స్‌ని డైనింగ్ హాలుకు తీసుకెళ్ళాడు.

★ ★ ★

"అక్కా, నిన్ను అరగంటలో పెళ్ళి పీటల

దగ్గరికి తీసుకురమ్మన్నారు నాన్నగారు. నీకు మేకప్ చేయడానికి నీ ఫ్రెండ్స్‌ని పిలిచాను" అంది ఉమ, మంచంపై పడుకుని ఉన్న సౌజన్యను సమీపించి.

"పెళ్ళికొడుకు అతనేనా?" అనుమానంగా అడిగింది సౌజన్య.

"ఇంకెవరనుకొంటున్నావ్?" అర్థం కానట్లు చూస్తూ అడిగింది ఉమ.

తన మనసులోని మాటను ఉమతో చెప్పడానికి సంకోచించింది సౌజన్య.

"మా స్టాఫ్ ఎక్కడ ఉన్నారు?" ఉమను అడిగింది.

ఆమె మనసులో ఏదో ఆశ. కళ్యాణిగాని, కిరీటిగాని ఏదో ఒకటి చేసి పెళ్ళికొడుకును మార్చడంగాని, ఈ పెళ్ళి క్యాన్సిల్ చేయడంగాని చేస్తారన్న ఆశ.

"భోజనాలయ్యాక కనబడలేదు నాకు. సెకండ్ షోకి వెళ్ళారేమో" అంది ఉమ.

బాధగా నిలబడిపోయింది సౌజన్య. ఇంతలో ఆమె స్నేహితురాళ్ళు వచ్చి ఆమెను పెళ్ళికి సిద్ధం చెయ్యసాగారు.

సరిగ్గా ఒంటిగంటకు ఆమెను కళ్యాణ వేదిక మీదకు పిలుచుకుని వచ్చారు. అప్పటికే పెళ్ళికొడుకు పీటలపై కూర్చుని ఉన్నాడు. సౌజన్య తల వంచుకుని పీటలపై కూర్చుంది తన కన్నీరు ఎవరికీ కనబడకుండా.

పురోహితులు మంత్రాలు చదువుతున్నారు.

"అక్కా! నీ ఎదురుగా కుర్చీలో కూర్చుని ఉన్నాడే- ఆయన ఎవరో నీకు తెలుసా?" ఉమ అడిగింది మెల్లగా.

సౌజన్య తల ఎత్తి ఎదురుగా కూర్చుని ఉన్న వ్యక్తిని చూసింది. కళ్ళనిండుగా నీరు ఉన్నందువల్ల అతనెవరో ఆమెకు స్పష్టంగా కనిపించలేదు.

"బాగా చూడక్కా" ఉమ అంది మళ్ళీ.

ఈసారి కళ్ళు తుడుచుకుని చూసింది. ఎదురుగా మొదటి వరుసలో పెళ్ళికొడుకు కూర్చుని ఉన్నాడు. ఆశ్చర్యంగా తన ప్రక్కన కూర్చున్న వ్యక్తిని చూసింది. అతను కిరీటి. ఆమె ఆనందానికి హద్దు లేకపోయింది.

కిరీటి ఆమె వైపు చూసి నవ్వాడు 'నీకు నేనున్నాను' అన్న భరోసా ఆ నవ్వులో కనిపించింది ఆమెకు.

"ఇది ఎలా సాధ్యమైంది?" ఉమను అడిగింది.

"వారిద్దరివల్ల సాధ్యమైంది" అంటూ వేదిక వైపు వస్తున్న దంపతుల్ని చూపించింది ఉమ. వాళ్ళు కళ్యాణీ శ్రీనివాస్‌లు.

* * *

స్టాఫ్ అందరూ నెల్లూరుకు బయలుదేరుతూంటే సౌజన్య కళ్యాణిని దూరంగా పిలుచుకుని వెళ్ళి "నాకు కొన్ని అనుమానాలు ఉన్నాయి. వాటిని నీవు తీర్చాలి" అంది.

"చెప్పు చెప్పు. ఏమిటి నీ డౌట్స్" చిలిపిగా నవ్వుతూ అంది కళ్యాణి.

"ఛ..అ డౌట్లు కావు. కిరీటిగారు ఈ పెళ్ళికి తనంతట తానే ఒప్పుకున్నారా?"

"అవును. ఇందులో ఎవరి బలవంతం లేదు. ఆయన మనస్ఫూర్తిగా ఒప్పుకొనే చేసుకున్నారు"

"మరి ఆ పెళ్ళికొడుకు తరపువాళ్ళు గొడవ చెయ్యలేదా?"

"కిరీటి స్నేహితుడు జమాలయ్య అని ఈ ఊరిలో సి.ఐ.గా పనిచేస్తున్నారు. ఆయనే డీల్ చేశారు వాళ్ళని. ఇంకో విషయం. మీ నాన్నగారు వాళ్ళకిచ్చిన డబ్బును నగదు రూపంలో కొంత, నగల రూపంలో కొంత రికవర్ చేశాము. అవీ చాలకుంటే స్టాంపు పేపర్లపై సంతకాలు చేయించుకుని వారం రోజుల్లో మీ డబ్బు మీకు తిరిగి యివ్వకుంటే కోర్టులో కేసు వేసేవిధంగా ఏర్పాటుచేశాము"

"అలాగా. వెరీగుడ్. మరి ఆ పెళ్ళికొడుకు వెళ్ళిపోకుండా అక్కడే కూర్చున్నాడేం?"

"అది మావారి ఆలోచన. మనసులు కలిస్తే పెళ్ళి ఎంత ఆనందంగా జరుపుకోవచ్చో, డబ్బు ప్రాధాన్యత లేని పెళ్ళి ఎంత మధురమైన అనుభూతిలా ఆ వధూవరుల గుండెల్లో నిలిచిపోతుందో అతనికి తెలియడం కోసం పెళ్ళితంతు అయ్యేవరకు వాళ్ళు కదలకూడదని కండిషన్ పెట్టారాయన. పోలీసు కేసుకు భయపడి మేము చెయ్యమన్నదల్లా చేశారు వాళ్ళు. మీ నాన్నగారిని ఒప్పించడానికే మాకు ఎక్కువ సమయం పట్టింది"

"కిరీటిగారి తల్లిదండ్రులు ఎలాంటి అభ్యంతరాలూ చెప్పకుండా ఒప్పుకున్నారా?"

"వాళ్ళు ఎంతో సంతోషించారు. 'మంచి పనులు చేయడానికి అవకాశం చాలామందికి వస్తాయి. కానీ చేయడానికి మంచి మనసు మాత్రం కొందరికే ఉంటుంది. ఆ కొంతమందిలో నువ్వున్నందుకు నాకు ఆనందంగా ఉంది' అని కొడుకును ఎంతగానో మెచ్చుకున్నారు కిరీటి తండ్రి. ఫోన్లోనే బంధుమిత్రులకు విషయం చెప్పి వీలైనంతమందిని పెళ్ళికి రప్పించారు ఆయన. కట్నం గురించి అడిగితే 'బంగారు బొమ్మలాంటి అమ్మాయిని యిస్తున్నారుగా. అంతకుమించి కట్నం ఏం కావాలి మాకు' అన్నారు కిరీటి తల్లి."

సౌజన్య రెండుచేతులూ జోడించి "మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను" అంది కళ్ళనీళ్ళతో.




"ఛ..ఏం మాటలవి? నీవు థ్యాంక్స్ చెప్పాల్సింది కిరీటిగారికి, అతని తల్లిదండ్రులకు. వాళ్ళ మనసులు నొప్పించకుండా చూసుకో. మంచి ఇల్లాలిగా, మంచి కోడలిగా పేరు తెచ్చుకోవాలి నువ్వు. నేను వెళ్ళి వస్తాను. ఐ విష్ యు ఎ వెరీ వెరీ హ్యాపీ మ్యారీడ్ లైఫ్" అంటూ సెలవు తీసుకుంది కళ్యాణి.

* * *

తిరుగుప్రయాణంలో కళ్యాణితో ఆమె కొలీగ్ సుమతి "కిరీటిగారు పదకొండు గంటల వరకూ మాతో పిచ్చాపాటీ మాట్లాడుతూ కూర్చుని ఉన్నారు. మరో పావుగంటలో తను సౌజన్యను పెళ్ళి చేసుకుంటానని చెప్పారు. అంత తక్కువ వ్యవధిలో ఆయన నిర్ణయం తీసుకోవడం వెనుక ఏదైనా కారణం ఉందా?" అని అడిగింది.

"ఉంది. కిరీటి స్వతహాగా మంచివాడే కాని నిర్ణయాలు తొందరగా తీసుకోడు. తొందరపాటు నిర్ణయాలు మంచిది కాదు.

నిజమే. కాని సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోకపోతే తర్వాత బాధపడాల్సి వస్తుంది. నిజానికి కిరీటి సౌజన్యను ప్రేమించాడు.

అయితే ఆ విషయం ఆమెతో చెప్పడానికి ఆలస్యం చేశాడు. ఈ లోపల సౌజన్య పెళ్ళిచూపులకు వెళుతున్నానని అతనితో చెప్పింది. అప్పుడు కూడా అతను తన మనసులోని మాట ఆమెతో చెప్పలేదు. బహుశా 'యింకా పెళ్ళిచూపులే కదా. అన్నీ కుదరాలి కదా' అనుకొని ఉంటాడు. సౌజన్య పెళ్ళి నిశ్చయం అయిందన్న విషయం తెలిసినప్పట్నుంచీ అతనిలో స్తబ్దత గమనించాను నేను.

నిన్న రాత్రి మరో అవకాశం వచ్చింది అతనికి. అప్పుడూ ఏ నిర్ణయం తీసుకోనంటాడు.

అన్ని పుస్తకాలు చదివిన మనిషి తన స్వంత విషయంలో కాస్త ధైర్యం చూపనంటాడు. ఎటూ పెళ్ళి క్యాన్సిల్ అయిపోతుందన్న ధీమా అతనిలో కనిపించింది నాకు. వెంటనే నేనూ, మా వారు ఓ పథకం ఆలోచించి అతనితో 'సౌజన్య బావ మరో అర్ధగంటలో ఊరినుంచి వస్తున్నాడనీ, సౌజన్యను చేసుకోమని అతన్ని కోరుతామనీ, అతనికి ఉద్యోగం లేదు కాబట్టి అతను ఒప్పుకునే అవకాశం ఉందని' కిరీటితో చెప్పాము. అంతే. వెంటనే తన యింటికెళ్ళి తల్లిదండ్రులతో మాట్లాడి, మళ్ళీ మా దగ్గరికి వచ్చి సౌజన్యను చేసుకుంటానన్నాడు. అతనికి వచ్చిన చివరి అవకాశం యిది అని తెలుసుకున్నాడు. కాబట్టి వెంటనే నిర్ణయం తీసుకున్నాడు" అంది కళ్యాణి.

"మంచి పని చేశారు. వంద అబద్ధాలు ఆడకుండా ఒక అబద్ధంతోనే ఈ పెళ్ళి జరిపించారు" అంటూ కళ్యాణినీ, శ్రీనివాస్‌నీ మెచ్చుకున్నారు వారితో ప్రయాణిస్తున్న సహోద్యోగులు.